
సాక్షి
అనంతపురం
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023




1 నుంచి ప్రీపీహెచ్‌డీ పరీక్ష
ఎస్కేయూలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులకు మే 1 నుంచి 3 వరకు ప్రీ పీహెచ్‌డీ రాత పరీక్ష నిర్వహించనున్నారు.



టమాట కిలో గరిష్ట ధర రూ.6
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4 పలికింది.

గరిష్టం/కనిష్టం
43.7°/ 23.9°
జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండలు మండి పోతున్నాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



న్యూస్‌రీల్

సీఎం జగన్‌ను కలిసిన కలెక్టర్



ముఖ్యమంత్రికి బొకే అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 2009 నుంచి 2012 వరకు మూడేళ్ల పాటు అనంతపురం ఆర్డీఓగా గౌతమి విధులు నిర్వర్తించారు. అనంతరం నెల్లూరు డ్వామా పీడీగా మూడేళ్లు, ఆ తరువాత టీటీడీ డిప్యూటీ ఈఓగా నాలుగేళ్లు, అటు తరువాత వైఎస్సార్ జిల్లా జేసీగా మూడేళ్లు పనిచేశారు. తిరుపతి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈఓగా పనిచేస్తున్న గౌతమి అనంతపురం కలెక్టర్‌గా నియమితులయ్యారు. తొలిసారి కలెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఆమె సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



కమాండెంట్ జగదీష్‌కు స్వాగతం పలుకుతున్న అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ నూతన కమాండెంట్‌గా జగదీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేస్తున్న అజితా వేజెండ్ల జగ్గయ్య పేట డీసీపీగా బదిలీపై వెళ్లారు. చిత్తూరు అడిషనల్ ఎస్పీగా పని చేస్తున్న జగదీష్ పదోన్నతిపై ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమితులయ్యారు. నూతన కమాండెంట్‌కు అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

'మిషన్ వాత్సల్య'కు 18,452 దరఖాస్తులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అమ్మా నాన్నలను కోల్పోయిన, నిరుపేద, నిస్సహాయ స్థితిలోని పిల్లలకు ఆర్థిక చేయూత కోసం ప్రవేశపెట్టిన 'మిషన్ వాత్సల్య' పథకానికి విశేష స్పందన లభిస్తోంది. 0–18 ఏళ్లలోపు పిల్లల విద్య, వైద్యం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఈ నెల 15 నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,452 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా హిందూపురం నుంచి దరఖాస్తులు రాగా, అత్యల్పంగా కణేకల్లు ప్రాజెక్టు నుంచి అందాయి. దరఖాస్తులను జిల్లా కార్యాలయానికి చేర్చారని, వాటిని ప్రత్యేక బృందంతో క్షుణ్ణంగా పరిశీలన చేయిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి తెలిపారు. ఈ ప్రక్రియ రెండు, మూడు రోజుల్లో పూర్తవుతుందన్నారు. అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులను కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ముందు ఉంచుతామన్నారు. ఎంపికైన ఒక్కో చిన్నారికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందుతుందన్నారు.

పాత ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా అందిన దరఖాస్తులు

ప్రాజెక్ట్ పేరు	దరఖాస్తులు
హిందూపురం	1,891
రాయదుర్గం	1,540
కూడేరు	1,364
కదిరి పడమర	1,325
తాడిపత్రి	2,214
గుత్తి	1,560
కంబదూరు	1,309
శింగనమల	862
ఉరవకొండ	903
కళ్యాణదుర్గం	434
కణేకల్లు	117
అనంతపురం అర్బన్	303
పెనుకొండ	1,273
ధర్మవరం	1,221
మడకశిర	1,103
చెన్నేకొత్తపల్లి	490
కదిరి తూర్పు	543
మొత్తం	18,452

పరపతి పెరిగింది

- వేరుశనగకు రూ.32 వేల పంట రుణం
- బ్యాంకర్లకున్న వెసులుబాటుతో 15 శాతం మేర అదనం
- వరి, మొక్కజొన్నకు రూ.42 వేలు, కందికి రూ.20 వేలు
- టమాట, మిరపకు రూ.90 వేలు, పత్తికి రూ.45 వేలు
- మల్బరీకి రూ.90 వేలు, ఆక్వాకు రూ.4.40 లక్షల రుణం



అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ మొదలు కానుండటంతో 2023–24 సంవత్సరానికి గాను పంటల వారీగా రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రెన్యూవల్స్, కొత్తగా పంట రుణాలు పొందనున్న రైతులకు ఈ మేరకు వర్తింపజేయనున్నారు. జిల్లాకు సంబంధించి ప్రధానపంట వేరుశనగకు ఎకరాకు రూ.32 వేల చొప్పున రుణం వర్తింపజేశారు. మెజార్టీ రైతులు వేరుశనగ పంట మీద రుణం తీసుకోనున్న నేపథ్యంలో బ్యాంకర్లకు 15 శాతం మేర ఉన్న వెసులుబాటుతో ఎకరాకు రూ.36 వేల నుంచి రూ.38 వేల వరకు ఇచ్చే అవకాశం ఉంది. వేరుశనగతో పాటు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలు, కూరగాయలు, ఔషధాలు, పూలసాగు, మల్బరీ, నర్సరీలు, పాడి, జీవాల పెంపకం తదితర అన్నింటికీ బ్యాంకు రుణపరిమితి ఖరారు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఎల్‌డీఎం, నాబార్డు ఏజీఎం, ప్రధాన బ్యాంకుల జిల్లా స్థాయి అధికారులు సలహాలు సిఫారసులు పరిగణనలోకి తీసుకున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అధికారులు పంపిన తుది జాబితాను ఎస్ఎల్‌టీసీ ఆమోదించినట్లు లీడ్‌బ్యాంకు వర్గాలు తెలిపాయి. గతేడాదితో పోల్చితే కొన్నింటికీ ఈసారి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ బాగా పెంచారు. వరి, పత్తి, మిరప, మల్బరీ, టమాట,అరటి తదితర పంటలకు ఎక్కువగా పెంచగా మిగతా వాటికి రూ.2 వేల వరకు పెంపుదల చేశారు. ఏప్రిల్ చివరి వారం నుంచి బ్యాంకర్లు పంట రుణాల రెన్యూవల్స్ మొదలు పెట్టనున్నారు. జూన్ నుంచి ఆగస్టు మధ్య జోరుగా రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీ ఉంటుందని లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ బి.నాగరాజారెడ్డి 'సాక్షి'కి తెలిపారు. గతేడాది ఖరీఫ్, రబీలో జిల్లా టార్గెట్ రూ.5,430 కోట్లు కాగా ఏకంగా రూ.8,748 కోట్ల మేర రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీ జరిగిందన్నారు. ఈసారి అంతకు మించి ఉంటుందని చెబుతున్నారు.

2023-24లో పంటల వారీగా రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఎకరాకు..

పంట	రుణపరిమితి	పంట	రుణపరిమితి
వేరుశనగ (వర్షాధారం)	రూ.32 వేలు	వేరుశనగ (నీటివసతి)	రూ.35 వేలు
వరి (ఖరీఫ్)	రూ.42 వేలు	వరి (రబీ)	రూ.45 వేలు
సజ్జ (నీటివసతి)	రూ.20 వేలు	సజ్జ (వర్షాధారం)	రూ.17 వేలు
కంది (నీటివసతి)	రూ.22 వేలు	కంది(వర్షాధారం)	రూ.20 వేలు
పప్పుశనగ	రూ.32 వేలు	పత్తి (నీటివసతి)	రూ.45 వేలు
పత్తి (వర్షాధారం)	రూ.42 వేలు	పెసర	రూ.20 వేలు
ఆముదం	రూ.18 వేలు	జొన్న(నీటివసతి)	రూ.21 వేలు
జొన్న (వర్షాధారం)	రూ.20 వేలు	మొక్కజొన్న(నీటివసతి)	రూ.42 వేలు
మొక్కజొన్న వర్షాధారం	రూ.26 వేలు	మొక్కజొన్న (సీడ్స్)	రూ. 45 వేలు
రాగి (నీటివసతి)	రూ.20 వేలు	రాగి (వర్షాధారం)	రూ.18 వేలు
కొర్ర (నీటి వసతి)	రూ.19 వేలు	కొర్ర (వర్షాధారం)	రూ.15 వేలు
పొద్దుతిరుగుడు	రూ.24 వేలు	ఉలవ, అలసంద	రూ.16 వేలు
మినుము	రూ.20 వేలు	చెరకు	రూ.80 వేలు
పచ్చి మిరప	రూ.75 వేలు	ఎండుమిరప	రూ.90 వేలు
ఉల్లి	రూ.50 వేలు	ధనియాలు	రూ.20 వేలు
తీగజాతికి	రూ.30 వేలు	టమాట (నార్మల్)	రూ.35 వేలు
టమాటా (హైబ్రీడ్)	రూ.90 వేలు	టమాట (ట్రెల్లీస్)	రూ.70 వేలు
వంకాయ	రూ.45 వేలు	బెండ (హైబ్రీడ్)	రూ.42 వేలు
మునగ	రూ.36 వేలు	కరివేపాకు	రూ.45 వేలు
సోయాబీన్	రూ.14 వేలు	ఫ్రెంచిబీన్స్	రూ.48 వేలు
అల్లం	రూ.56 వేలు	కాలీఫ్లవర్	రూ.45 వేలు
తమలపాకు	రూ.80 వేలు	వక్క	రూ.43 వేలు
వీ-1 మల్బరీ	రూ.90 వేలు	బొప్పాయి (తైవాన్)	రూ.77 వేలు
అరటి ప్లాంటేషన్	రూ.80 వేలు	అరటి (టిష్యూకల్చర్)	రూ.1.20 లక్షలు
చీనీ, నిమ్మ	రూ.55 వేలు	మామిడి	రూ.45 వేలు
బొప్పాయి	రూ.90 వేలు	డ్రాగన్‌ఫ్రూట్	రూ.60 వేలు
జామ (హైడెన్సిటీ)	రూ.95 వేలు	జామ (సాధారణం)	రూ.45 వేలు
ద్రాక్ష	రూ.1.05 లక్షలు	దానిమ్మ	రూ.90 వేలు
సపోట	రూ.30 వేలు	అంజూర	రూ.35 వేలు
కర్బూజ	రూ.55 వేలు	కళింగర	రూ.35 వేలు
రేగు	రూ.31 వేలు	చింత	రూ.18 వేలు
చిన్న నర్సరీలు	రూ.7 లక్షలు	పెద్ద నర్సరీలు	రూ.20 లక్షలు
రోజాపూలు	రూ.35 వేలు	రోజా (కొత్తరకం)	55 వేలు
మల్లెపూలు	రూ.50 వేలు	బంతిపూలు	రూ.45 వేలు
కనకాంబరం	రూ.33 వేలు	చామంతి	రూ.50 వేలు
ఉసిరి	రూ.27 వేలు	అలోవేరా	రూ.24 వేలు
పాడి పశువు	రూ.35 వేలు	పాడి గేదె	రూ.45 వేలు
జీవాలు (25+1)	రూ.42 వేలు	చేపలపెంపకం	రూ.4.40 లక్షలు

1,71,992 జవాబుపత్రాలు

- రేపటి నుంచి టెన్త్ 'మూల్యాంకనం'



కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో 'స్పాట్' కోసం ఏర్పాట్లు

రాప్తాడురూరల్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాల నుంచి 1,71,992 జవాబుపత్రాలు అనంతపురానికి వచ్చాయి. సోషల్ సబ్జెక్టు మినహా తక్కిన అన్ని సబ్జెక్టుల పత్రాలు వచ్చాయి. వచ్చిన జవాబుపత్రాలను కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో కోడింగ్ చేస్తూ స్ట్రాంగ్‌రూంలో భద్ర పరుస్తున్నారు. అత్యధికంగా ఇంగ్లిష్ సబ్జెక్టు జవాబుపత్రాలు 49,249 వచ్చాయి. తెలుగు 25,270, తెలుగు (కాంపోజిట్) 2,601, హిందీ 22,508, గణితం 28,364, ఫిజికల్ సైన్స్ 22 వేలు, బయలాజికల్ సైన్స్ 22 వేల జవాబుపత్రాలు ఉన్నాయి. పీఎస్, బీఎస్ తప్ప అన్ని సబ్జెక్టుల జవాబుపత్రాల కోడింగ్ పూర్తయింది. సోషల్ స్టడీస్‌కు సంబంధించి దాదాపు 25 వేల జవాబుపత్రాలు మంగళవారం నాటికి జిల్లాకు చేరతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని సబ్జెక్టులు కలిపితే దాదాపు 2 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. మొత్తం 1,057 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 211 మంది స్పెషల్ అసిస్టెంట్లను 'స్పాట్' విధులకు నియమించారు. బుధవారం మూల్యాంకన ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఏర్పాట్లు సిద్ధం : కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో జరిగే టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకనం కోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేస్తోంది. డీఈఓ, మూల్యాంకనం క్యాంపు అధికారి ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ సిబ్బందితో తరచూ సమావేశాలు ఏర్పాటు చేస్తూ వసతులపై చర్చిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఫ్యాన్లు ఉండేలా చూస్తున్నారు. వరండాలో మూల్యాంకనం చేసేవారితో పాటు గదుల్లోకూడా ప్రత్యేకంగా ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గదిలోనూ వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. 'స్పాట్'కు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని డీఈఓ స్పష్టం చేశారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం అర్బన్: 'స్పందన' అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్వో గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆస్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 226 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం 'స్పందన' అర్జీల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి కణేకల్లు ఈఓ, ఉరవకొండ ఉద్యాన శాఖ అధికారి, గార్లదిన్నె, రాప్తాడు మండల సర్వేయర్లు ఇన్‌కరెక్ట్ ఎండార్స్‌మెంట్లను అర్జీదారులకు పంపించారని ఆగ్రహించారు. ఇది సరైన పద్ధతి కాదని వాటిని వెంటనే సరిచేసి పంపించాలని ఆదేశించారు. అర్జీదారులకు క్షేత్రస్థాయి అధికారులు పంపించే ఎండార్స్‌మెంట్లు సరిగా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలించాలని ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై తీసుకున్న చర్యల గురించి నివేదికను పంపించాలని చెప్పినా చాలామంది పంపలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నివేదికను సీపీఓకు పంపించాలని ఆదేశించారు.



అర్జీదారుల సమస్య వింటున్న జేసీ కేతన్‌గార్గ్

అర్జీల్లో కొన్ని..

- రాయదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్ తన సొంత వ్యాపారానికి కార్మికులతో పనిచేయించుకుంటున్నారని మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, నాగభూషణం 'స్పందన'లో ఫిర్యాదు చేశారు. రాయదుర్గంలో ఆరు చెరకు రసం షాపులు, కళ్యాణదుర్గంలో రెండు షాపులు ఏర్పాటు చేసి అందులో మున్సిపల్ కార్మికులతో పనిచేయిస్తున్నాడని ఆరోపించారు.
- తమ భూమిని వేరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించారని పుట్లూరు మండలం గురుగు చింతలపల్లికి చెందిన లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 633–2లో 66 సెంట్లు, 633–3లో 3 ఎకరాలు మొత్తం 3.66 ఎకరాల భూమిని 25 ఏళ్లుగా సాగు చేసుకుంటూ చీనీ చెట్లు పెట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపింది. అయితే ఈ భూమిని వేరేవారి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరింది.

ఆత్మహత్యాయత్నం నిలువరింపు



పోలీసుల మధ్య ఉన్న వ్యక్తి ఆలూరు శేఖర్

అర్జీదారుడి ఆత్మహత్యాయత్నాన్ని పోలీసులు నిలువరించారు. తాడిపత్రికి చెందిన ఆలూరు శేఖర్‌కు సుంకులమ్మ పాలెంలో 456 సర్వే నంబరులో 54 సెంట్ల భూమి ఉంది. తండ్రి నుంచి సక్రమించిన ఈ భూమిలోనే ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నాడు. అయితే ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యంగా భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. వారితో పోరాడలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుందామనుకుని సోమవారం రెవెన్యూ భవన్‌లో 'స్పందన'కు వచ్చాడు. అర్జీదారులను తనిఖీ చేసే క్రమంలో శేఖర్ వద్ద పురుగు మందు బాటిల్ ఉండటాన్ని పోలీసులు గుర్తించి.. ఆరా తీశారు. బాధితుడి గోడు విన్న ఆర్డీఓ భూ సమస్యపై విచారణ చేసి న్యాయం చేయాలని తాడిపత్రి తహసీల్దార్‌ను ఆదేశించారు. వన్‌టౌన్ ఎస్ఐ గౌస్‌బాషా కూడా శేఖర్ సమస్యను తాడిపత్రి ఎస్ఐకు ఫోన్ ద్వారా వివరించి.. పరిశీలించాలని సూచించారు.

అర్జీదారులకు సత్వర న్యాయం

- 'స్పందన'లో డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'స్పందన' కార్యక్రమంలో సమస్యలు విన్నవించుకున్న అర్జీదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో నిర్వహించిన 'స్పందన'ను డీఐజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ నాగేంద్రుడు, హనుమంతుకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అర్జీదారులకు చట్టపరిధిలో నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపాలని సూచించారు.

కౌన్సెలింగ్ మరింత పటిష్టం

కలహాలు, మనస్పర్థలతో సతమతమవుతున్న దంపతులను ఒక్కటి చేసేందుకు కౌన్సెలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా కౌన్సెలింగ్ ఇవ్వడానికి నిపుణులైన సైకియాట్రిస్టు, అడ్వొకేట్, గైనకాలజిస్ట్, ఎన్జీఓ, రిటైర్డు ప్రభుత్వ అధికారులను ఆహ్వానించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 'దిశ' డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు (94913 08867)ను సంప్రదించాలని సూచించారు. ఎడబాటు జంటలను ఏకం చేయడంలో ప్రతిభ కనబరచిన కౌన్సెలర్లకు ఏటా ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలి పారు. దిశ స్టేషన్‌లో ప్రతి బుధ, శనివారాల్లో బాధిత భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.



సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

పోలీస్ సేవలపై ప్రదర్శన

డీపీఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారికి బోర్ కొట్టకుండా 'దిశ', డయల్ 100, పోలీసు సేవలపై చిత్రాలను ప్రదర్శించాలని డీఐజీ సూచించారు. తద్వారా పోలీసులందించే సేవలు ప్రజల్లో బాగా గుర్తుండిపోతాయన్నారు.

ఎస్‌ఏ-2 పరీక్షల సమయంలో మార్పులు

- ఉదయం 8 గంటలకే ప్రారంభం

రాప్తాడురూరల్: ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి జరగనున్న ఎస్‌ఏ–2 పరీక్షల వేళలను ఎండల దృష్ట్యా మార్పు చేశారు. 1 నుంచి 8 తరగతులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగాల్సిన పరీక్షను ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. 9 తరగతి పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరగాల్సి ఉండగా.. ఉదయం 8 గంటల నుంచి 11.15 గంటల వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పరిచయం లేని ఆప్తులు

- హెల్ప్‌లైన్‌కు కాల్ చేస్తే ఆపన్న హస్తం
- మహిళలు..చిన్నారులకు ప్రత్యేక రక్షణ
- ప్రమాద బాధితులకు అండగా 108
- ఫోన్ చేస్తే పశువుల వైద్యమూ ఇంటికే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇదేంటి.. కనీసం ముఖ పరిచయం లేకుండా ఆప్తులు ఎలా అవుతారు? అయిన వాళ్లే కాదని వెళ్తున్న రోజులు కదా అని అనుకునేరు. సమయానుకూలంగా స్పందిస్తే అందరూ మనవాళ్లే. ఆపదలో నేనున్నానంటూ నా అన్నవాళ్లు ఎవరూ ముందుకు రాకపోవచ్చు. వారి సాయం మీకు దక్కకపోవచ్చు. అయినా కుంగిపోవాల్సిన అవసరం లేదు. భయపడాల్సిన అవసరం అంతకంటే లేదు. ప్రభుత్వ వ్యవస్థలో పకడ్బందీగా అమలవుతోన్న హెల్ప్‌లైన్ వంటి రక్షణ కవచాలను వాడుకుంటే అవే మీకు కొండంత అండ. ఎవరికి ఎక్కడ ఆపద వచ్చినా మేమున్నామంటూ ముందుకు వస్తారు. ఆ ఆప్తుల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.

CALL 104 MEDICAL HELPLINE
ఆరోగ్యశ్రీ సేవలు, వైఎస్సార్ ఆసరా సమాచారంతో పాటు వైద్య సలహాలు, సూచనల కోసం 104కు కాల్ చేయవచ్చు. ఆరోగ్య శ్రీ రోగుల ఫాలోఅప్‌కు సంబంధించిన వైద్య సేవలను కూడా 104 సిబ్బంది అందిస్తారు.

CALL 108 EMERGENCY
ప్రమాదాలు, అత్యవసర సమయాల్లో 108కు కాల్ చేస్తే హుటాహుటిన అంబులెన్స్ వస్తుంది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపదనుంచి గట్టెక్కించే '108' వాహనాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో మండలానికొకటి ఉన్నాయి. కాల్ చేసిన 20 నిమిషాల్లో ఈ వాహనాలు మన చెంత చేరుతాయి.

1033
జాతీయ రహదారిలో ప్రమాదాలు జరిగిన సమయంలో 1033కి ఫోన్ చేయగానే వాహనం వస్తుంది. 24 గంటలూ పర్యవేక్షించడానికి జాతీయ రహదారుల సంస్థ ఇటీవలే మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేసింది.

DIAL 100 POLICE
మనపై ఎవరైనా దాడికి యత్నించినా, చోరీకి యత్నించినా వెంటనే 100కు కాల్ చేస్తే పోలీసులు వస్తారు. 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

CHILD LINE 1098 NIGHT & DAY
కొందరు తల్లిదండ్రులు అవగాహన లేక తమ పిల్లలకు 18 ఏళ్లలోపే పెళ్లి చేస్తారు. చట్టరీత్యా ఇది నేరం. ఇలా ఎవరైనా బలవంతంగా కానీ, పిల్లలకు ఇష్టం లేకపోయినా గానీ పెళ్లికి ఏర్పాట్లు చేస్తే 1098కు కాల్ చేస్తే వెంటనే అలాంటి వివాహాలను ఆపేస్తారు.

In case of Fire DIAL 101
ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే 101కు కాల్ చేస్తే చాలు అత్యంత వేగంగా ఘటనా స్థలికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుంటారు. నష్ట నియంత్రణకు కృషి చేస్తారు. ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే వచ్చేస్తారు.

14400
ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల మీద వెళ్లే సామాన్యులను కొంతమంది సిబ్బంది లంచం అడిగే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో 14400కు కాల్‌చేస్తే బాధ్యులను శిక్షిస్తారు.

CALL 181 WOMEN HELPLINE
ఇదిప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్. మహిళలపై ఎవరైనా అఘాయిత్యం చేస్తున్నా, లేదా అమ్మాయిలను అపహరణ చేస్తున్నా బంధువులు కానీ, పరిసర ప్రాంతాల వారుకానీ 181కు కాల్ చేస్తేనే సిబ్బంది అందుబాటులోకి వస్తారు. వారికి న్యాయం జరిగేలా చూస్తారు.

CALL 1962 MOBILE VETERINARY CLINIC
దేశంలో మొట్టమొదటి సారిగా పశువుల వైద్యానికీ టోల్‌ఫ్రీ నంబర్ కేటాయించింది రాష్ట్ర ప్రభుత్వం. మీ పశువులకు ఏదైనా జబ్బు చేస్తే 1962కు ఫోన్ చేసిన 40 నిమిషాల్లో వెటర్నరీ డాక్టర్, లేదా వెటర్నరీ అసిస్టెంట్ ఇంటికొస్తారు. మీ పశువుకు వచ్చిన జబ్బుకు పరీక్షలు చేసి మందులిస్తారు.

హెల్ప్‌లైన్ ఒక మంచి ఆయుధం

ఆపదలో ఉన్నవారికి హెల్ప్‌లైన్ నంబర్లు ఒక ఆయుధం లాంటివి. పోలీసు నుంచి అగ్నిమాపకం, చైల్డ్ హెల్ప్‌లైన్ ఇలా ఏదైనా కానీ సాయం అందుతుంది. కాల్ చేసిన అరగంటలోపే ఘటనా స్థలికి చేరుకునే అవకాశం ఉంటుంది.

–ఆర్ల శ్రీనివాస్, డీఎస్పీ, దిశ పోలీస్ స్టేషన్

రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడంలో రాజీ పడబోరాదని వైద్యాధికారులకు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిని సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో సమావేశమై మాట్లాడారు. వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంలో పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలని సూచించారు. కార్యక్రమంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, వైద్యాధికారులు భీమసేనాచారి, డాక్టర్ గౌస్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య



దేవరకొండపై కారు బోల్తా

- స్కూల్ కరస్పాండెంట్ దుర్మరణం


కొండపై నుంచి కిందపడిన కారు

బుక్కరాయసముద్రం: స్థానిక దేవరకొండపై లోయలో కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడిని అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన శ్రీవిద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ఉమాపతి (55)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన మేరకు... సోమవారం ఉదయం అద్దె కారును మాట్లాడుకుని నార్పలకు ఉమాపతి ప్రయాణమయ్యాడు. బుక్కరాయసముద్రానికి చేరుకోగానే తన మనసు మార్చుకుని దేవరకొండకెళ్లి స్వామిని దర్శించుకుని వద్దామని డ్రైవర్ ఉజ్జినప్పకు తెలిపారు. దీంతో కారును దేవరకొండ పైకి డ్రైవర్ చేర్చాడు. ఆ సమయంలో తాను ఓ ఇంపార్టెంట్ కాల్ మాట్లాడాల్సి ఉందని, కాసేపు బయట వేచి ఉండాలన్న ఉమాపతి సూచనతో డ్రైవర్ కారును వదిలి దూరంగా వెళ్లాడు. కారులో ఉమాపతి ఒంటరిగా కూర్చొని ఫోన్‌లో మాట్లాడుతుండగా... ఉన్నఫళంగా పల్లం వైపుగా కారు ముందుకు కదిలింది. గమనించిన డ్రైవర్ కేకలు వేస్తూ ఉమాపతిని అప్రమత్తం చేసేలోపు ఒక్కసారిగా ప్రొటెక్షన్ బీమ్ మీదుగా దాదాపు వంద అడుగుల లోయలోకి కారు దూసుకెళ్లి... దిగువన రోడ్డు మలుపులో బోల్తా పడింది. ఆ సమయంలో మంటలు చెలరేగడంతో ఉమాపతి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ఉమాపతికి భార్య కోమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న శింగనమల సీఐ అస్రార్ బాషా, ఎస్‌ఐ జమాల్‌బాషా హుటాహుటిన దేవరకొండకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఉమాపతి మృతదేహాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


ఉమాపతి మృతదేహం, ఉమాపతి (ఫైల్)

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 29 వాహనాల స్వాధీనం

బుక్కరాయసముద్రం: జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటకలోనూ ద్విచక్ర వాహనాలు అపహరించుకెళుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం బుక్కరాయసముద్రం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ జమాల్ బాషా, సీసీఎస్ ఎస్‌ఐ నాగరాజు వెల్లడించారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లా పావగడ తాలూకా నాగులమడక హోబళి గ్యాడిగుంటి గ్రామానికి చెందిన దూదేకుల బాబు... జల్సాలకు అలవాటు పడి జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో తన జల్సాలకు అవసరమైన డబ్బును సులువుగా సంపాదించేందుకు ద్విచక్రవాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. సోమవారం ఉదయం అనంతపురం నగర శివారులోని గోశాల వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన దూదేకుల బాషా... పోలీసుల కళ్లు గప్పి ఉడాయించేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం వచ్చిన ఎస్‌ఐలు జమాల్‌బాషా, నాగరాజు, సిబ్బంది వెంబడించి అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దూదేకుల బాషాపై కేసు నమోదు చేసి, అతను ఇచ్చిన సమాచారం మేరకు 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నేడు లైలతుల్ ఖద్ర్

- రంజాన్ ముందు నిర్వహించే అతి పెద్ద పండుగ
- ముస్తాబైన మసీదులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇస్లాంలో ఏడాది మొత్తంలో రంజాన్ మాసాన్ని శుభప్రదమైనదిగా భావిస్తారు. అలాంటి శుభప్రదమైన మాసంలో అత్యంత పుణ్యప్రదమైన రేయిని 'లైలతుల్ ఖద్ర్'గా పిలుస్తారు. రంజాన్ మాసం 27వ రోజున నిర్వహించే లైలతుల్ ఖద్ర్ రానేవచ్చింది. మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసిన అనంతరం రాత్రి జాగారణ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సిద్ధమయ్యారు. రంజాన్ మాసంలో రోజూ తరావిహ్‌లో ఖురాన్‌ను పఠించిన ముస్లింలు.. లైలతుల్ ఖద్ర్ రాత్రికి మొత్తం ఖురాన్‌ను ముగిస్తారు. అల్లాహ్ కృపను పొందేందుకు ఇది దోహదం చేస్తుందని భావిస్తారు. ఈ మాసంలో చేసే ప్రతి పుణ్యకార్యానికి ఏడింతల పుణ్యం ఫలం దక్కుతుందని విశ్వసిస్తారు. ఈ క్రమంలో లైలతుల్ ఖద్ర్‌ను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముస్లింల శ్మశాన వాటికల్లో ప్రార్థనలు చేసేందుకు అనువుగా పారిశుద్ధ్య పనులు పూర్తి చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరుసటి రోజు ఉదయం సహరీని కూడా ఏర్పాటు చేశారు.

లైలతుల్ ఖద్ర్ ఎందుకు పవిత్రమైనది

మహమ్మద్ ప్రవక్తపై రచించిన పవిత్ర గ్రంథం ఖురాన్. మానవుని జీవిత విశేషాలు, భూమి మీద తొలి మానవుడి రాక, అనంతరం ఆయన కోసం ఏర్పాటు చేసిన ఇతర అంశాలు, తాను మరణించిన తరువాత జరిగే పరీక్ష, జీవితాన్ని ఏవిధంగా గడపాలనే అంశాలపై మహమ్మద్ ప్రవక్త ప్రవచనాల రూపమే ఖురాన్. అంతటి పవిత్రమైన ఖురాన్ లైలతుల్ ఖద్ర్ రోజున భువిపై ఆవిష్కృతమైనట్లుగా ముస్లింలు భావిస్తారు. దీంతో ఆ రాత్రిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావించి, జాగారణతో ప్రత్యేక ప్రార్థనల్లో నిమగ్నమవుతారు.


ముస్తాబైన ఈద్గా మసీదు

సద్వినియోగం చేసుకోండి



లైలతుల్ ఖద్ర్ రాత్రి అత్యంత పవిత్రమైనది. ఈ రాత్రిని ముస్లింలకు అల్లాహ్ అందించిన ఒక పెద్ద కానుకగా ప్రతి ఒక్కరూ భావించాలి. ఈ రాత్రే ఖురాన్ భూమి మీద అవతరించింది. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మౌలానా అబ్దుల్లా, ఈద్గా మసీదు, అనంతపురం

స్కార్పియో ఢీకొని వృద్ధుడి మృతి

- కుమారుడికి తీవ్రగాయాలు


మృతుడు వెంకటప్ప, గాయపడిన నాగరాజు

గార్లదిన్నె: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చెందిన వెంకటప్ప (60) సోమవారం ఉదయం తన కుమారుడు నాగరాజుతో కలసి ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. గార్లదిన్నె శివారులోని జంబులదిన్నె చెరువు వద్ద 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి మహారాష్ట్ర నుంచి బెంగళూరుకు వెళ్తున్న స్కార్పియో వాహనం వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. ఘటనలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటప్ప మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న నాగరాజును నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఎస్‌ఐ సాగర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన స్కార్పియో డ్రైవర్ సూరజ్ గైక్వాడ్‌ని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసు నమోదు చేశారు.

108 పైలట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అరబిందో ఈఎంఎస్ 108 అంబులెన్స్ సర్వీసెస్‌లో ఖాళీగా ఉన్న పైలట్ (డ్రైవర్) ఉద్యోగాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు 108 సేవల కో–ఆర్డినేటర్ వీరారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత, ట్రాన్స్‌పోర్ట్ హెవీ లైసెన్స్, ఐదేళ్ల అనుభవం, ఇంగ్లిష్ చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను అనంతపురం సర్వజనాస్పత్రి ప్రాంగణంలోని 108 కార్యాలయంలో స్పందించవచ్చు. ఎంపికైన వారు అనంతపురం జిల్లాలోని బొమ్మనహాళ్, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి, పుట్టపర్తి, చెన్నేకొత్తపల్లి, అగళి, మడకశిర, పెనుకొండ, ఓడీసీ, గోరంట్ల, కొత్తచెరువు, కనగానపల్లి మండలాల్లో పని చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 87901 19419లో సంప్రదించవచ్చు.

ఇరువర్గాల ఘర్షణ

విడపనకల్లు: భూ వివాదంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. విడపనకల్లు మండలం డొనేకల్లు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న 30 సెంట్ల గ్రామకంఠం భూమిలో చాలా కాలంగా స్థానికులు గడ్డివాములు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామకంఠంలో నివేసన స్థలాలు ఇవ్వాలంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఎస్సీలు విన్నవిస్తూ వచ్చారు. దీంతో సోమవారం ఉదయం ఆ భూమిని సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లారు. ఆ సమయంలో అధికారులను రాజేష్, విశ్వనాథ్, హనుమయ్య, సురేష్ అడ్డుకోవడంతో పరుశురాం, ఎల్లమ్మ, సోము, నాగన్న, గంగమ్మ వాగ్వాదానికి దిగారు. పది మందికి మంచి జరుగుతుందని, సర్వేకు సహకరించాలని హితవు పలికారు. దీంతో ఆగ్రహించిన రాజేష్, హనుమయ్య, విశ్వనాథ్, జయన్న, సురేష్ కట్టెలతో దాడికి తెగబడ్డారు. పరుశురాం వర్గీయులు సైతం ప్రతి దాడికి దిగారు. దీంతో పరుశురాం, ఎల్లమ్మ, గంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ తెలిపారు.

మృతుడు బుడ్డప్పనగర్ నివాసి

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లి సమీపంలో హెచ్చెల్సీ వద్ద పొలాల్లో ఆదివారం పోలీసులు గుర్తించిన మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతుడిని అనంతపురంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన హసన్ కుమారుడు షేక్ బాబా ఫక్రుద్దీన్ (35)గా గుర్తించారు. ఫ్లవర్ డెకరేషన్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. భార్యతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. తొలుత మరో ప్రాంతంలో హతమార్చి యర్రాయపల్లి వద్ద పొలాల్లో పడేసినట్లుగా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి ఫొటో సోమవారం ఉదయం దిన పత్రికల్లో ప్రచురితం కావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పోలీసులు వైరల్ చేయడంతో కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే బత్తలపల్లికి చేరుకుని పోలీసులను కలిశారు. అయితే మృతికి కారణాలు తెలియదని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

ప్రావిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా టీబీ యూనిట్‌లో సీనియర్ ట్యూబర్ క్లొసిస్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, టీబీ హెల్త్ విజిటర్ ఉద్యోగాలకు సంబంధించి అర్హులైన వారి ప్రావిజనల్ మెరిట్ జాబితాను https://ananthapuramu.ap.gov వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాబితాపై అభ్యంతరాలు ఏవైనా ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు.

నీటి సంపులో పడి మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మక్క

బ్రహ్మసముద్రం: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం మర్రిమాకులపల్లికి చెందిన గొల్ల నాగరాజు, లక్ష్మక్క (40) దంపతులు. గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్న వీరు ఇటీవల తమ కుమారుడితో కలసి గొర్రెలను మేపు కోసం బ్రహ్మసముద్రం మండలానికి వచ్చారు. సోమవారం ఉదయం గొంచిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో గొర్రెలను మేపునకు తీసుకెళ్లిన లక్ష్మక్క.. మధ్యాహ్నం ఎండ వేడిమికి దాహం తీర్చుకునేందుకు సమీపంలోని పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి సంపు వద్దకెళ్లింది. సంపులో నుంచి నీటిని తీసుకునే క్రమంలో అదుపు తప్పి అందులో పడిపోయింది. లోతు ఎక్కువగా ఉండడంతో బయటకు రాలేక నీట మునిగి మృతి చెందింది. ఎంతసేపటికీ తల్లి రాకపోవడంతో కుమారుడు నీటి సంపు వద్దకెళ్లి పరిశీలించడంతో ఘటన వెలుగు చూసింది. చుట్టపక్కల పొలాల్లో పనిచేస్తున్న కూలీలు అక్కడకు చేరుకుని లక్ష్మక్క మృతదేహాన్ని వెలికి తీశారు. సమాచారం అందుకున్న బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

11 మందిపై న్యూసెన్స్ కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తప్పతాగి మసీదు వద్ద అల్లరి చేసిన 11 మంది టీడీపీ కార్యకర్తలపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం సీఐ రవి శంకరరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పీకల దాకా మద్యం సేవించిన టీడీపీకి చెందిన బంగి నాగాతో పాటు మరో పది మంది యువకులు నగరంలోని పాతూరు లో ఓ మసీద్ వద్ద గొడవ పడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అడ్డుకోబోయిన పలువురు ముస్లింలపై దురుసుగా వ్యవహరించారు. స్థానికుల సమాచారం మేరకు మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, సోమవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

అరటి తోటకు నిప్పు


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురంలో రైతు శివకుమార్ ఐదు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట మంటల్లో కాలి బూడిదైంది. సోమవారం ఉదయం తోటలో మంటలు చెలరేగడంతో గుర్తించిన రైతు వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగయ్య, సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే దాదాపు వెయ్యి చెట్లు కాలిపోయాయి.

'పోలీసు స్పందన'కు 88 వినతులు


సమస్యపై ఆరా తీస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 88 వినతులు అందాయి. అర్జీలు స్వయంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కాగా, భూతగాదాలు, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, రస్తా వివాదాలపై అత్యధికంగా వినతులు అందినట్లు జిల్లా పోలీసు కార్యాలయం వెల్లడించింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, ఎస్‌బీ సీఐ ఇందిర, టెక్నికల్ ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైనిక సంక్షేమ నిధికి విరాళాలు



హుండీలను అందజేస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా సైనిక సంక్షేమ నిధికి విరాళాలు అందజేశారు. గతేడాది డిసెంబర్ 7న జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్పటి నుంచి విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని (హుండీలు – లెక్కించలేదు) జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి జే శ్రీనివాసులుకు వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. మురళీధర్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎన్ ఆర్ సదాశివారెడ్డి, డాక్టర్ చాగంటి రామిరెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏక్రష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ఆఫీసు సిబ్బంది ఆదినారాయణ రెడ్డి, వహీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాపతి మృతికి 'అపుస్మా' సంతాపం



ఉమాపతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమానులు

రాప్తాడురూరల్: నగరంలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతి మృతికి ప్రైవేట్ పాఠశాలల యజమానులు సంతాపం తెలియజేశారు. సోమవారం స్థానిక అపుస్మా కార్యాలయంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉమాపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా ట్రెజరర్ ఇక్బాల్, గౌరవాధ్యక్షుడు నాయుడు, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఈసీ సభ్యులు శశిభూషణ్, నాగరాజు, మాంటిస్సోరి సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీ స్కూల్ మధుసూదన్‌రెడ్డి, శంకర్‌ప్రసాద్, రామచందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు నగరంలోని పలు ప్రైవేటీ స్కూళ్లలో విద్యార్థులకు అధికారులు ఫైర్ డెమో నిర్వహించారు. ప్రమాదవశాత్తూ శరీరానికి నిప్పు అంటుకున్నప్పుడు ప్రాణాపాయం జరగకుండా ఎలా తనను తాను రక్షించుకోవాలనే అంశంపై వివరించారు. పొగ నిండిన గదుల నుంచి బయటకు వచ్చే సమయంలో ముఖద్వారం నుంచే బయటకు రావాలని, పై అంతస్తుల్లో మంటలు చెలరేగినట్లయితే మెట్ల మార్గాన్ని ద్వారానే రావాలని తెలిపారు. ఫైర్ ఇంజన్‌తో మంటలను ఎలా ఆర్పాలి.. నీటి ద్వారా పలు విన్యాసాలు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విశ్రాంత ఉద్యోగికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ నాయకులు బలరాం తల్లి, విశ్రాంత ఉద్యోగి ఆర్ జ్యోతి సోమవారం ఉదయం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అరవిందనగర్ (30వ డివిజన్)లోని మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. కార్పొరేటర్లు చవ్వా రాజశేఖర్ రెడ్డి, మల్లెమీద నరసింహులు, కమల్‌భూషణ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎర్రిస్వామిరెడ్డి, నాయకులు మారుతీనాయుడు, రుద్రంపేట పురుషోత్తం, రియాజ్, విజయసతీష్ పాల్గొన్నారు.











ఆటో 'హీట్' రోయ్..
'మ్యాట్' టాప్ రోయ్!

ఏప్రిల్‌లో ఎండ టాప్ లేపుతోంది. రోడ్లపైకి రావాలంటేనే వడదెబ్బ తగులుతుందేమోనని జనం జంకుతున్నారు. అత్యవసర పనిమీద బయటకెళ్లాల్సి వచ్చిన కొందరు చెట్టునీడన సేదతీరుతుంటే.. మరికొందరు చల్లని పానీయాలు తాగుతున్నారు. పాదచారులు గొడుగునీడనో.. కొంగు నీడనో వెళ్తున్నారు. ఇక ఆటో ప్రయాణమంటే హీట్ ఎక్కిపోవాల్సిందే. ఓ వైపు ఎర్రటి ఎండ.. మరోవైపు భగ భగమండే వేడి.. ఎప్పుడెప్పుడు గమ్యస్థానానికి చేరుకుంటామా.. అని ఆలోచిస్తున్న పరిస్థితి.. నగరంలోని ఆటోవాలాలు వినూత్నంగా ఆలోచించారు. ప్రయాణికులను 'మ్యాట్' నీడన 'కూల్'గా తీసుకెళ్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



అర్రర్రే.. 'ఆటో' చెయ్యెయ్యండి!



పైకి లేచిన ఆటోను కిందకు దింపే ప్రయత్నం చేస్తున్న దృశ్యం

సాయంత్రం సమయం.. రోడ్లన్నీ రద్దీగా ఉన్నాయి. ఎటుచూసినా ట్రాఫిక్.. ఆర్టీసీ బస్టాండు నుంచి గుత్తిరోడ్డు వైపు ఇనుప కడ్డీలతో ఆటో రయ్యిమంటూ దూసుకెళ్తోంది. చంద్ర ఆస్పత్రి సర్కిల్‌కు వెళ్లగానే స్పీడు బ్రేకర్ ఎక్కే క్రమంలో ఉన్నట్టుండి బరువంతా వెనక్కు పడి ముందుచక్రం పైకి లేచింది. అంతలోనే వాహనదారులు అప్రమత్తమై..చాకచక్యంగా వ్యవహరించారు. 'ఆటో' చేయి..ఇటో చేయి వేసి ప్రమాదం నుంచి గట్టెక్కించారు. అదే సమయంలో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ స్పందించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. నగరంలో బరువైన లోడుతో వెళ్లేటప్పుడు వాహనదారులు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు, వాహనదారులు చర్చించుకున్నారు. – రాప్తాడు రూరల్:

అన్ని వర్గాలకూ న్యాయం చేయడమే లక్ష్యం



39వ డివిజన్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 39వ డివిజన్‌లో జరుగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులతో మమేకమై ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు తెలుసుకొని నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూవైఎస్సార్ సీపీ పాలనలో తమకు అన్ని విధాలా న్యాయం జరుగుతోందని లబ్ధిదారులు తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకందించిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. ఈ నెల 20లోపు కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉన్నందుకు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక నేతలు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు ప్రతి లబ్ధిదారుని ఇంటికీ వెళ్లాలన్నారు. గత టీడీపీ పాలన, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనకు ఎంతో వ్యత్యాసం ఉందని లబ్ధిదారులు చెప్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమవుతుండడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, నాయకులు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్నే మా భవిష్యత్తు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యవేక్షణలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నగరంలోని 50 డివిజన్లలో వేగవంతంగా సాగుతోంది. సోమవారం జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధుతో పాటు కార్పొరేటర్లు శేఖర్‌బాబు, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్ , టీపీ చంద్రమోహన్ రెడ్డి, తదితర కార్పొరేటర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గత టీడీపీ ప్రభుత్వంలోని ఇబ్బందులు తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అందుతున్న సంక్షేమం, నగరాభివృద్ధిని లబ్ధిదారులకు వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనంతపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు మల్లెల వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం ఏ నారాయణపురం పంచాయతీ పరిధిలోని స్టాలిన్‌నగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. మల్లెల వేణుగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవని అన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జాఫర్‌వలి, అశ్వర్థఆచారి, మహమ్మద్ రఫీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఆత్మకూరు: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల వ్యాప్తంగా గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎంత మేరకు అందుతున్నాయో ప్రజలకు గుర్తు చేశారు.



ఆత్మకూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి నగరంలోని మారుతీనగర్‌లోని అర్ఫాత్ మసీదులో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారితో కలిసి ఇఫ్తార్‌లో భాగస్వాములయ్యారు. ఇఫ్తార్ విందులు ప్రస్తుతం కుల, మతాలకతీతంగా నిలుస్తున్నాయన్నారు. ఇఫ్తార్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అన్ని వర్గాలకు చెందిన వారు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, మసీదు ముతవల్లి జాఫర్‌సాబ్, సీఐ జాకీర్‌హుస్సేన్, రాష్ట్రనాయీబ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసులు, మసీదు కమిటీ సభ్యులు దాదాపీర్, సర్దార్, ఖాశీం, నరసింహులు, నిహార్‌రెడ్డి, శివారెడ్డి, బబ్లూ, నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ విందులో మేయర్

విజయవాడలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో నగర మేయర్ వసీం పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషాతో కలిసి ఆయన పాల్గొన్నారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోండి



పేరూరులో ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ముస్లింలందరూ పవిత్ర రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మసీదులో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోమవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీదులో ముస్లింతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీలు అందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీర్ రామకృష్ణా రెడ్డి, ఎంపీటీసీలు పవన్‌కుమార్ రెడ్డి, నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ

రామగిరి: ముస్లింలకు పవిత్రమాసం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పేరూరు, గంగంపల్లి, మాదాపురం గ్రామాల్లోని మసీదులల్లో ఎంపీ రంజాన్ తోఫా అందించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, మండల కోఆప్షన్ మెంబర్ ముజుబుర్ రహిమాన్, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కురుబ ముత్యాలప్ప, సర్పంచ్ రాజేష్, నాయకులు మల్లికార్జున, బోయ నాగేంద్ర, జేష్ఠ్యరామయ్య, రామలింగారెడ్డి,రామాంజనేయులు పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తి ఉండాలి

రాప్తాడు: విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపితేనే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని బీఎస్ఎన్ఎల్ సంస్థ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ బాషా విద్యార్థులకు సూచించారు. సోమవారం హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఎనిగ్మా–2కే 23 ఈసీఈ విభాగపు విద్యార్థులు జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు (సింపోయిజమ్)ను నిర్వహించారు. ఎస్వీఐటీ కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట సావనీర్‌ను విడుదల చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ టి. సూర్యశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో బీఎస్ఎన్ఎల్ సంస్థ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ బాషా మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలు చేయడం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని, విజ్ఞానంతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఇంజనిరింగ్‌లో అధునాతన ఆవిష్కరణలు చేయాలన్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలన్న ఉద్దేశంతో జాతీయ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



సావనీర్ విడుదల చేస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న ప్రాజెక్టులు :

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎనిగ్మా–2కే 23 ఈసీఈ విభాగపు విద్యార్థులు టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా కళాశాలలో దాదాపుగా 100కు పైగా పరిశోధన ప్రేపర్ ప్రెజెంటేషన్లు, 30 ప్రాజెక్టు మోడల్స్, వర్క్ షాపు పోస్టర్ ప్రెజెంటేషన్లు, కాంపాక్ట్ రోబోట్, సెజ్ బాట్‌లను ప్రదర్శించగా, అన్ని నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మేఘరాజు, కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, కళాశాల ఈసీఈ హెచ్‌వోడీ ఎస్‌పీవీ ప్రసాద్, పీడీ శ్రీనివాసుల నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ స్థలాలను విడిపించండి



ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చిన రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, నాయకులు

రాప్తాడురూరల్: కబ్జాకు గురైన ధోబీఘాట్ స్థలాలను విడిపించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని రజక సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను తన నివాసంలో రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న, సీపీఐ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు లింగమయ్య, రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కమ్మన్న, కృష్ణమూర్తి, సీవీ హరికష్ణ తదితరులు కలిశారు. వారు మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి, రాప్తాడు మండలం యర్రగుంటలో దోబీఘాట్ స్థలాలు కబ్జా అయ్యాయని, న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రాప్తాడు, అనంతపురం తహసీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో రజక కుల ప్రతినిధులు నాగప్ప, వెంకటరాముడు, ఫక్కీరప్ప తదితరులు ఉన్నారు.

దాడులకు పాల్పడడం దురదృష్టకరం

అనంతపురం సప్తగిరి సర్కిల్: మసీదుపై పచ్చ మూకలు దాడులకు పాల్పడడం దురదృష్టకరమని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ అన్నారు. సోమవారం స్థానిక మున్నానగర్‌లోని ఇస్మాయిల్ మసీదు ఎదుట వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం రాత్రి టీడీపీ అల్లరి మూకలు మసీదుపై దాడి చేశాయన్నారు. మద్యం మత్తులో మసీదు మౌలానా, మసీదుకు వచ్చే వారిని అనుచితంగా మాట్లాడడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలను పార్టీలకతీతంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.దీనిపై టీడీపీ నాయకులు ఖండించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై పోలీసులు కూడా సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే కుళ్లాయిస్వామి, కువైట్ ఖాదర్‌బాషా, గఫార్, ఇమ్రాన్, షేక్ జావిద్, జాఫర్ (బబ్లూ) పాల్గొన్నారు.

మహారాజశ్రీ అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P. No. 05/2020 in O.S. No. 219/2016

Between:

కె. పుల్లారెడ్డి ...వాది/డి.హెచ్.ఆర్.

మరియు

ఆర్. రవీంద్రరెడ్డి ...ప్రతివాది/జె.డి.ఆర్

జె.డి.ఆర్ కు సేల్ నోటీసు

టు. ఆర్. రవీంద్రరెడ్డి తండ్రి ఆర్.పుల్లారెడ్డి, వ్యాపారం, డోర్ నెం. 1/687, రుద్రంపేట, అనంతపురము రూరల్ మండలం.

పై దావాలో జె.డి.ఆర్. అయిన మీకు సేల్ నోటీసు నిమిత్తం పై కేసు 21-04-2023వ తేదీకి వాయిదా కలదు. కనుక మీరు పై తెలిపిన కోర్టు నందు పై తేదీన 10-30 గంలకు స్వయముగా గాని వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైన అభ్యంతరములున్నచో తెలుపుకొనవచ్చును. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

CIDDE GANGADHARA REDDY
Advocate, Anantapuramu

ప్రయాణికులకు అసౌకర్యం కలిగించొద్దు



రైల్వే స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

అనంతపురం సిటీ: రైల్వే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత రైల్వేఅధికారులపై ఉందని ఎంపీ రంగయ్య అన్నారు. సోమవారం ఆయన అనంతపురం రైల్వే స్టేషన్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. ఏ రైలు ఎక్కడ ఆగుతుందో తెలిసేలా డిస్‌ప్లే బోర్డులు తక్షణం ఏర్పాటు చేయాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు వీలుగా లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈసందర్భంగా రైల్వే రాయితీ పాసుల జారీలో సమస్యలను పలువురు జర్నలిస్టులు ఎంపీ దృష్టికి తెచ్చారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్ భాస్కర్ రెడ్డి అరెస్టు అక్రమం

అనంతపురం క్రైం: వైఎస్ భాస్కర్ రెడ్డి అరెస్టు అక్రమమని వైఎస్సార్‌సీపీ నేత వెన్నపూస రవీంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సీబీఐ.. టీడీపీ అధినేత చంద్రబాబు కనుసన్నల్లో నడుస్తోందని ఆరోపించారు. సీబీఐ అధికారి ఇరుపక్షాల వాదనలు విని న్యాయాన్యాయాలను సమీక్షకుండానే ఏకపక్షంగా దర్యాప్తుతో వైఎస్ భాస్కర్ రెడ్డిని అరెస్టు చేశారన్నారు. త్వరలోనే ఆయన కడిగిన ముత్యంలాబయటకు వస్తారని ఆయన అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో 50 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇవ్వాలని, ఆర్‌బీకేలను పీఏసీఎస్‌లలో విలీనం చేస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలు రద్దు చేయాలన్నారు. జీఓ 36, జీఓ 90 ప్రకారం వేతనాలు, ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలన్నారు. 2019, ఏప్రిల్ ఒకటి నాటి వేతన సవరణ చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలన్నారు. జీఓ 36లో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసు పెంచాల న్నారు. అనంతరం జేసీ కేతన్‌గార్గ్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా, నగర కార్యదర్శులు నాగేంద్రకుమార్, వెంక ట నారాయణ, సంఘం నాయకులు దామోదర్, శ్రీనివాసులు, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ సోమవారం రెండో రోజూ కొనసాగింది. ఆకుతోటపల్లిలోని ప్రాథమికోన్నత విద్యార్థులకు కెరీర్ గైడ్‌లైన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ సత్యసౌమ్య పాల్గొన్నారు.

నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవ ర్యాలీ

అనంతపురం కల్చరల్: ప్రపంచ వారసత్వ దినోత్సవ ర్యాలీ చేస్తున్నట్లు పురావస్తు శాఖ ఏడీ రజిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టూరిజంశాఖ, ఇంటాక్ సంస్థల సహకారంతో మంగళవారం సాయంత్రం స్థానిక కోర్టు రోడ్డులోని పురావస్తుశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృద్ధులు, చూపు మందగించిన వారికి, కంటి సమస్యలున్న వారికి ఈనెల 19న కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వరలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కంటి సమస్య ఉన్న వారు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు.